క్లుప్తంగా

కొనసాగుతున్న 'స్వచ్ఛతా హీ సేవా'

హుజూర్‌నగర్ : పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం ఎస్‌బీఐ బ్యాంకు బజార్‌లో మెయిన్ రోడ్ నుంచి ఆబ్కారీ పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. బ్లీచింగ్ ఫౌడర్ చల్లించారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్లు పద్మ, శివ కుమారి, సానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెమ్మాది ఉపేందర్



మునగాల : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని తాడువాయిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ నెమ్మాది ఉపేందర్ ఎన్నికయ్యారు. బుధవారం నల్లగొండలోని బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొంపెల్లి భిక్షపతి, రాష్ట్ర అధ్యక్షుడు యానాం విజయ్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడి రామకృష్ణ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మంగళపల్లి అయోధ్య సమక్షంలో ఉపేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేళ్లచెరువు : కోదాడలో ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించిన క్రీడల్లో మండల కేంద్రంలోని ఐడియల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు కె.రోహిణి, ఎం.కీర్తిక ఉత్తమ ప్రతిభ కనబరిచి 35 వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సముద్రాల రమణకుమార్ బుధవారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా మక్తల్‌లో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో సూర్యాపేట జిల్లా తరుపున ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని పీఈటీ భసవయ్య, ఉపాధ్యాయులు రాజశేఖర్, విద్యార్థులు అభినందించారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతిరావ్‌పూలే, సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మహాత్మాజ్యోతిరావ్‌పూలే, సావిత్రిబాయిపూలేలు స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నేరేడుచర్లలో సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావ్‌పూలే, సావిత్రిబాయిపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ హుజూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు వాసా పల్లయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, రజాక్, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు చందనబోయిన లక్ష్మి, పావని, సయ్యద్ రేష్మా, శ్యామల, మరియమ్మ, నర్సమ్మ, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

క్వాలిటీ విభాగంలో 'మైహోం' కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న పరిశ్రమ ప్రతినిధులు

మేళ్లచెరువు : సిమెంట్ తయారీ, నాణ్యతపై అవగాహన కోసం హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో మంగళవారం రాత్రి తెలుగు రాష్ట్రాల సిమెంట్ పరిశ్రమలకు క్వాలిటీ సర్కిల్ ఛాప్టర్ కన్వెన్షన్ పోటీలు నిర్వహించగా మేళ్లచెరువు మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమకు రెండు గోల్డ్ అవార్డులు లభించినట్లు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ పోటీలో 227 టీమ్‌లు పాల్గొనగా మైహోం పరిశ్రమకు చెందిన రెండు టీమ్‌లు విశేష ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ అవార్డులు గెలుచుకున్నట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కోదాడ : కోదాడ మండలంలోని అల్వాలపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొచ్చెర్ల రమేష్ భార్య సునీత అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, మాజీ సర్పంచ్ శోభరాణి, జగ్గయ్య, రంగా, కోటి, కృష్ణయ్య, అప్పారావు తదితరులు ఉన్నారు.

వేగం పెంచితే ప్రమాదమే



నారాయణపురం గ్రామ శివారులోని మూలమలుపులో రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

కోదాడ : చిలుకూరు మండల పరిధిలోని పలు గ్రామాల లింకు రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరుపక్కలా చెట్లు ఏపుగా పెరిగి రోడ్లను కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అంతేకాకుండా పలు రోడ్లు కూడా అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా చిలుకూరు మండల కేంద్రం నుంచి దూదియాతండా రోడ్డు, దూదియాతండా గ్రామం నుంచి జానకీనగర్ రోడ్డు, దూదియాతండా నుంచి నారాయణపురం రోడ్డు, సీతారాంపురంలోని జాతీయ రహదారి నుంచి నారాయణపురం వరకు గల రోడ్డు ఇరుపక్కలా కంప చెట్లు కమ్మేశాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్లను కమ్మేసిన కంపచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐడియా.. అదుర్స్



కోదాడ : చిలుకూరు మండల కేంద్రానికి చెందిన పూజారి అనిల్ దివ్యాంగుడు. ఆయన నడవలేడు. కొన్నేళ్లుగా ఆయన డీజిల్‌తో నడిచే ట్రైసైకిల్‌ను వినియోగిస్తున్నాడు. వర్షాలకు, ఎండలకు దేవాలయాలకు, పూజా కార్యక్రమాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుండడంతో ట్రైసైకిల్‌కు పైన కప్పు.. చుట్టూ ప్లాస్టిక్ రేకులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయించుకున్నాడు. దీంతో అందరూ వాట్ ఏ ఐడియా అంటూ ఆయనను అభినందిస్తున్నారు.

అంగన్‌వాడీల్లో సామూహిక సీమంతాలు



నేలమర్రిలో గర్భిణులకు పూలు, పండ్లు అందజేస్తున్న అధికారులు

మునగాల : మునగాల మండల కేంద్రంతో పాటు నేలమర్రి గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమలకు తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ రమేష్‌దీనదయాళ్, సీడీపీఓ పారిజాత ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో ఆర్ఐ రామారావు, సూపర్‌వైజర్లు శ్రీలత, సరిత, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సంతోష్, అంగన్‌వాడీ టీచర్లు ఆర్.స్వరూపరాణి, జి.సంధ్యారాణి, జయలలిత, నిర్మల, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



హుజూర్‌నగర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న సీఐ

హుజూర్‌నగర్ : నేరాల నియంత్రణలో సీసీ కెమెరా పాత్ర కీలకమని సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ శాఖ తరుపున సర్కిల్ పరిధిలోని అన్ని స్టేషన్ల పరిధిలో దాదాపు 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. పట్టణంలో సుమారు 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కెమెరాలను త్వరలో ఉన్నతాధికారులతో ప్రారంభిచనున్నట్లు ఆయన చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మఠంపల్లి : సమాజాన్ని పట్టి పీడిస్తున్న సైబర్ నేరగాళ్లు, సంఘ విద్రోహశక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పెదవీడులో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మఠంపల్లి ఎస్ఐ పెదపంగ బాబుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులను, ఆడపిల్లలను ఇబ్బందులకు గురిచేసే ఆకతాయిలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత గంజాయి, జూదం, తదితర వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

యాత్రదానం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

మేళ్లచెరువు : యాత్రదానానికి ముందుకు రావాలని కోదాడ డిపో మేనేజర్ శ్రీనివాసరావు దాతలను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మైహోం పరిశ్రమ వద్ద యాత్రదానం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా పేదలకు, అనాథ పిల్లలకు, విద్యార్థులకు విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలను చూపించాలనే ఉద్దేశంతో టీఎస్ ఆర్టీసీ యాత్రదానం కార్యక్రమం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీరామ్, డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయనాయక్

నడిగూడెం : విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరుచుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.విజయనాయక్ కోరారు. బుధవారం కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్.షేక్.జానిపాషా, కర్నాటి శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట చెత్త వేస్తే జరిమానా

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల వెంట చెత్తాచెదారం, ప్లాస్టిక్‌ను పారబోస్తే వారికి జరిమానా తప్పదని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్ హెచ్చరించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ పాత ఇనుప షాపులో వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను లింగగిరి రోడ్డులో నూతన బైపాస్ వెంట పారబోసినందుకు జరిమానా యజమానికి రూ.5 వేల జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ చెత్త బండి సిబ్బందికి అందజేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

మేళ్లచెరువు : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కందిబండ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా కోసం మహిళలు, వృద్ధులు, పిల్లలు క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భసవయ్య, కేఎల్ఎన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రుక్కయ్య యాదవ్, సుందరయ్య, గురవయ్య, రవి, సైదులు, నాగరాజు, నాగభూషణం, సుధాకర్, వెంకయ్య, వీరబాబురెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ బిడ్డలు.. అక్కాచెల్లెళ్లు



దారావత్ స్పందన



దారావత్ అమృత

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా పరిధిలోని బాడవాతండాకు చెందిన దారావత్ నవీన్‌నాయక్ –నాగమణి దంపతుల కూతుర్లు చదువులో రాణిస్తున్నారు. పెద్దకుమార్తె దారావత్ స్పందన నీట్‌లో మంచి మెజార్టీ మార్కులతో ప్రభుత్వ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. చిన్న కుమార్తె దారావత్ అమృత జేఈఈ అడ్వాన్స్, జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించి జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ ఐఐటీలో సీఎస్ఈలో సీటు సాధించింది. దీంతో బుధవారం స్థానికంగా గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు.. విద్యార్థులను అభినందించారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి అభినందన



ఎంబీబీఎస్ సీటు సాధించిన శ్రీరామ్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన శ్రీలం సోమయ్య –త్రివేణి దంపతుల కుమారుడు శ్రీరామ్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. దీంతో బుధవారం విద్యార్థిని కోదాడ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నియోజకవర్గ కన్వీనర్ ముసి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ వికాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ఫీడర్లు మునగాల, తాడువాయి, నారాయణగూడెం, ఎస్ఎం పేట, వివిధ ఇండస్ట్రీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

లంబాడీలను తొలగించాలనడం రాజ్యాంగ విరుద్ధం

మఠంపల్లి : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ విరుద్ధమని అఖిల పక్ష గిరిజన నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సీపీఎం, బీఆర్ఎస్, తెలంగాణ జన సమితి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, తదితర పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాళోతుబాలునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులుగా ఉంటూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న సోయం బాపురావు, తెల్లం వెంకట్రావుల తీరుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై లంబాడీలను ఐకం చేసి కుట్రలను తెలియజేసేందుకు ఈనెల 27న మఠంపల్లిలో నిర్వహించబోయే రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సాదాసోత్ భిక్షం నాయక్, చందర్‌రావునాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

మునగాల : మండలంలోని సీతానగరంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పల్లపు సతీష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



మునగాల : నర్సింహులగూడెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణారెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని మండలంలోని నర్సింహులగూడెంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడలు నిర్వహిస్తున్న యువకులను సీఐ అభినందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట రమేష్, క్రికెట్ సీనియర్ క్రీడాకారుడు మేకల రామారావు, గ్రామపెద్దలు చింతమళ్ల కోటేష్, షేక్ నాగుల్ మీరా, జూలకంటి గోపిరెడ్డి, జాని, సాంబశివరావు, క్రికెట్ పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలు ఐక్యతకు దోహదం

నడిగూడెం : గ్రామీణ క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని ఓర్సు కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ ఓర్సు నాగరాజు తెలిపారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో దసరా పండుగను పురస్కరించుకొని మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ గందమళ్ల అజయ్‌కుమార్, దాతలు న్యాయవాది బాదె శ్రీను, పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ యాతాకుల ప్రమోద్ కుమార్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పందిటి క్రాంతికుమార్, నడిగూడెం మాజీ సర్పంచ్ చిల్లంచర్ల సత్యనారాయణ, నిర్వాహకులు పందిటి శ్యామ్, గంటిపంగు సుదీప్, డాక్టర్.పేరెల్లి కోటి, పాతకొట్ల ప్రకాష్, పల్లపు నాగేశ్వరరావు, దున్నా శ్రీనివాస్, పాతకొట్ల రాము, పాతకొట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం

గరిడేపల్లి : క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని ఎస్ఐ నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, కుక్కడపు మహేష్, నామ నర్సింహారావు, నాగరాజు, మేకల నాగేశ్వరరావు, సాంబయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మునగాల : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం మండల కేంద్రంలో పలు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ సరితకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా టీపీసీజేఏ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీగా పోటీ చేస్తా : వేమూరి

మునగాల : రిజర్వేషన్లు అనుకూలిస్తే మునగాల జెడ్పీటీసీ స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 15ఏళ్లుగా మండలంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించానని, అదే విధంగా క్రీడ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతుగా కృషిచేశానన్నారు.

వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ : స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిలుకూరు మండలంలోని రామాపురంలో గల ఆరోగ్య ఉప కేంద్రంలో మహిళలకు డాక్టర్ వంగవీటి భరత్ చంద్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల వైద్యం కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకు వైద్య పరీక్షలు చేస్తామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు మీరాబి, మహేశ్వరి, ఆశా వర్కర్లు పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రం ప్రారంభం



విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రంను ప్రారంభిస్తున్న ఎస్ఈ ఫ్రాంక్లిన్

నేరేడుచర్ల : నేరేడుచర్లలో నూతనంగా నిర్మించిన విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాన్ని బుధవారం సూర్యాపేట జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ ఫ్రాంక్లిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సౌకర్యార్థం దాత గజ్జల రవీందర్‌రెడ్డి తన సొంత నిధులతో విద్యుత్ బిల్లుల కేంద్రాన్ని నిర్మించడం అభినందనీయం అని అన్నారు. అనంతరం నిర్మాణ దాత గజ్జల రవీందర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ట్రాన్స్‌కో డీఈ వెంకటకృష్ణ, ఏడీఈ నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, శ్రీనివాస్, రవివర్మ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు



కోదాడ : ఆజాద్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలో బుధవారం విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ ఫ్రాంక్లిన్, ఎస్ఏఓ సత్యనారాయణ, డీఈలు వెంకట కిష్టయ్య, శ్రీనివాసులు, ఏడీఈలు నాగిరెడ్డి, వెంకన్న, రాములు, ఏఈలు, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆజాద్‌నగర్‌లో..

కోదాడ : పట్టణంలోని ఆజాద్‌నగర్ ఎంఆర్‌సీ వద్ద స్థానికులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఈ సందర్భంగా మహిళలు గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ ఆడారు.

ఉత్తరప్రదేశ్ కార్మికులను విడుదల చేయాలి

గరిడేపల్లి : డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన ఘటనలో అరెస్ట్ చేసిన ఉత్తరప్రదేశ్ కార్మికులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల నుంచి వేలాది మంది కూలీలు వలస వచ్చి తక్కువ వేతనంతో మన రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్నారని, అలాగే డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో కూడా ఉత్తరప్రదేశ్ కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటన పోలీసులకు కార్మికులకు మధ్య జరిగినది కాదని, యాదృచ్ఛికంగా జరిగిందే తప్పా వేరే ఉద్దేశంతో జరిగింది కాదన్నారు. వారిపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, నబి, సైదులు పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరం

హుజూర్‌నగర్ : నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో బుధవారం బాప్టిస్ట్ మెడికల్ మిషన్ క్లినిక్ ఉప్పల లేవి దంపతులు ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని తహసీల్దార్ సురగి సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాపోలు కరుణాకర్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాపోలు హెప్సీబా, మాజీ జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, పాస్టర్లు అబ్రహం, పల్లె శ్యామ్ డేవిడ్, రమేష్, రవి, నాగయ్య, వెంకన్న, శేఖర్, అనిల్, సంపత్, అజయ్, సిద్దు, సతీష్, సుధాకర్, సైదిరెడ్డి, వీరస్వామి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

గెల్లి అప్పారావు, అరుణ సేవలు చిరస్మరణీయం

హుజూర్‌నగర్ : రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గెల్లి అప్పారావు, అరుణలు వ్యాపార, సేవా రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో గెల్లి అప్పారావు, అరుణల సంతాప సభ నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి గెల్లి రవి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, కాంగ్రెస్, వివిధ పార్టీల, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ ద్వారబంధ ప్రతిష్ఠ




ద్వారబంధం ప్రతిష్ఠాపనోత్సవంలో గ్రామస్తులు

మేళ్లచెరువు : మండలంలోని హేమ్లాతండా గ్రామంలో సీతారామ అభయాంజనేయస్వామి దేవాలయం (ద్వారబంధం) దర్వాజ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ భూక్యా జయరాంనాయక్ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో దేవాదాయ శాఖ నిధుల నుంచి మంజూరైన సుమారు పదిలక్షలతో ద్వారబంధం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు భానుకిరణ్‌శర్మ, మాజీ సర్పంచ్ రాజమ్మజయరాంనాయక్, రాంజీ నాయక్, భూక్యా బాలు, మాజీ ఎంపీటీసీ సోమా నాయక్, శ్రీను, బాలాజీ, సాయి, శంకర్, బుజ్జీ, కృష్ణ, జగదీష్‌నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- శైలజ మృతితో శోకసంద్రంలో కుటుంబం



నలుగురు పిల్లలతో శైలజ భర్త బుచ్చిబాబు

కోదాడ : గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటన మోతె మండలంలోని రావిపహాడ్‌లో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిపహాడ్‌కు చెందిన చాట్ల బుచ్చిబాబు–శైలజ (35)కు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నాడు. తన భర్త, పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం ఏడాది క్రితం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. విధి వక్రీకరించి శైలజకు హార్ట్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి గుండె ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ చేసిన కొద్ది రోజులకే విపరీతమైన కడుపు నొప్పి రావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ఆమె మృతి చెందింది. నలుగురు పిల్లలు ఉన్న తల్లి శైలజ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు బోరున విలపించడం పలువురుని కంటతడిపెట్టించింది.

అన్నపూర్ణాదేవి అవతారంలో కనకదుర్గమ్మ



కోదాడ : మదర్ థెరిస్సా పాఠశాల వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారికి 150 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న అర్చకులు, భక్తులు



మేళ్లచెరువు : వనదుర్గా ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



నడిగూడెం : సిరిపురంలో..



హుజూర్‌నగర్ : నేరేడుచర్లలోని శివాలయంలో..



గరిడేపల్లి : కీతవారిగూడెంలో..